సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



విశ్వసనీయతే కీలకం
పోలీసు వ్యవస్థపై విశ్వసనీయ మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. 8లో



కరువు 'కోత'లు..!
వరికోతలకు యంత్రాలను వినియోగిస్తుండటంతో రైతులకు శ్రమ తగ్గినా మూగజీవాలకు మేత దొరకడంలేదు. 8లో



వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదై వాతావరణం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుండాల: గిరిజన గురుకుల కళాశాల నుంచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు గుండాల గురుకులం ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కళాశాల విద్యార్థులు ఇ.సన్ని, వై.నవదీప్ అండర్–14 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. గోల్డ్‌మెడల్ సాధించడంతోపాటు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి 14 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో జరగనున్న క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ బాబూరావు, బుచ్చయ్య అభినందించారు.

విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912..



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముద్రించిన టోల్ ఫ్రీ నంబర్

సింగరేణి(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా టోల్ ఫ్రీ నంబర్ 1912 ఏర్పాటు చేశామని కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.మహిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ట్రాన్స్‌ఫార్మర్లపై నంబర్ ముద్రిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, విద్యుత్ సరఫరాలో అంతరాయం, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్లలో మార్పులు, అన్ని రకాల కొత్త కనెక్షన్ల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, కేటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సేవలు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పొందవచ్చని అన్నారు.


పౌష్టికాహారం ప్రతీ పౌరుడి హక్కు



మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆనంద్

ఖమ్మం సహకారనగర్: పౌరులంతా పౌష్టికాహారం అందుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతి తెలిపారు. ఈ మేరకు అమల్లో ఉన్న ఆహార భద్రత చట్టాన్ని అధికారులు పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఆహార భద్రత చట్టం అమలుపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి వారు అధికారులతో సమీక్షించారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు, న్యూట్రీ గార్డెన్ల వివరాలను అధికారులు వెల్లడించారు. అనంతరం సభ్యులు ఆనంద్, జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక అభివృద్ధికి అవసరమైన పోషకాలు అందేలా మెనూ రూపొందించినందున అమలుచేయాలన్నారు. అయితే, వెజిటబుల్ బిర్యానీ, కోడిగుడ్ల సరఫరాలో లోపాలు గుర్తించామని తెలిపారు. గురుకులాలకు చిన్న సైజ్ గుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేయడంతోపాటు తీసుకున్న చర్యలపై 15రోజుల్లో నివేదిక అందించాలని సూచించారు. పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు.

గోల్డెన్ అవర్ కీలకం



సైబర్ నేరాల్లో తొలిగంటకు ఎంతో ప్రాధాన్యం

- జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- మోసపోయిన వెంటనే అప్రమత్తమైతే మేలు
- కోల్పోయిన సొమ్మును రికవరీ చేసే అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏదైనా ప్రమాదం జరిగితే తొలి గంటలోపు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తే వారికి ప్రాణాపాయం తప్పే అవకాశాలతోపాటు త్వరగా కోలుకుంటారు. అందువల్లే ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. ఈ గోల్డెన్ అవర్ థియరీ సైబర్ క్రైం నేరాల్లోనూ వర్తిస్తుంది.

ఎన్నో మోసాలు

కూరగాయలు కొనడం, టీ తాగడం, ఆటో కిరాయి పే చేయడం వరకు అన్ని విషయాల్లో ఫోన్‌ల ద్వారా నగదు చెల్లింపులు పెరుగుతున్నాయి. చిల్లర సమస్యలు లేకపోవడం వల్ల వినియోగదారులతోపాటు వ్యాపారులు కూడా వీటివైపు మొగ్గు చూపుతున్నారు. నగదు లావాదేవీల్లో బ్యాంకులకు వెళ్లి గంటల తరబడి చేసే పనులు ఫోన్‌లో క్షణాల్లో అయిపోతుండటంతో వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు ఫోన్‌లో ఆర్థిక లావాదేవీలు జరిపేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకుని మెసేజ్‌లు, ఇ–మెయిల్, ఫోన్ కాల్ ద్వారా సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు, ఉద్యోగ అవకాశాలు, రుణాలు ఇస్తాం, ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చింది, మీకు వచ్చిన ఆర్డర్‌లో గంజాయి ఉంది, లక్కీ లాటరీ తగిలింది.. వంటి ఎత్తులు వేస్తూ అకౌంట్ల నుంచి నగదు బదిలీ చేయించుకుంటున్నారు. ఇలా కాజేసిన సొమ్మును ప్రధానంగా రెండు మార్గాల ద్వారా సైబర్ నేరగాళ్లు సొంతం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చకచకా కాజేస్తారు

ఆన్‌లైన్ లావాదేవీలపై అనుమానం కలిగితే సదరు ఖాతాలను తక్షణమే ఫ్రీజ్ చేసే అధికారం ప్రభుత్వ విభాగాలకు ఉంది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ ఖాతాలోకి డబ్బులు రాగానే ఏటీఎంల ద్వారా నగదు రూపంలో డ్రా చేస్తుంటారు. నగదు డ్రాపై ఉన్న నిబంధనల కారణంగా ఒకేసారి ఎక్కువ మొత్తంలో డబ్బును విత్ డ్రా చేసుకునే అవకాశం లేదు. దీంతో సైబర్ చోరులు ఆ సొమ్మును అనేక ఖాతాల్లోకి బదిలీ చేసి, ఆ ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డుల ద్వారా మొత్తం నగదు సాధ్యమైనంత త్వరగా ఊడ్చేసేందుకు ప్రయత్నిస్తారు. చోరులు ఈ పనులన్నీ చేయడానికి ముందుగానే ఫిర్యాదు చేయగలిగితే అనుమానం ఉన్న సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ అవుతాయి. తద్వారా మన కష్టార్జితాన్ని కాపాడుకునే వీలుంటుంది.

ఈ కామర్స్‌లో కొనుగోళ్లు

ఈ కామర్స్ సైట్ల ఖాతాలోకి వెళ్లిన డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం చాలా చాలా తక్కువ. దీంతో మాయమాటలతో సామాన్యులను బురిడీ కొట్టించి దోచేసిన సొమ్ముతో వివిధ ఈ కామర్స్ సైట్లలో విలువైన వస్తువులను కొనేందుకు సైబర్ కేటుగాళ్లు ఉపయోగిస్తారు. ఇలా కొన్న విలువైన వస్తువులను బయట అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు.

జిల్లాలో 378 నేరాలు

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 378 సైబర్ క్రైం నేరాలు నమోదయ్యాయి. మోసపోయిన వెంటనే కొందరు పోలీసులను ఆశ్రయించడం, సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా అనేక కేసుల్లో సానుకూల ఫలితాలు వచ్చాయి. ఇటీవల జూలూరుపాడులో జరిగిన ఓ మోసం విషయంలో బాధితులు రూ. 2 కోట్ల వరకు నష్టపోగా అందులో రూ. 57 లక్షలు రికవరీ చేయగలిగారు. గతంలో అయితే మొత్తం పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

తక్షణమే స్పందించాలి

సైబర్ చోరులు ఏటీఎం, ఈ కామర్స్ సైట్ల ద్వారా నగదు తస్కరించే అవకాశం ఇవ్వకూడదంటే మోసపోయిన వెంటనే అప్రమత్తం కావాలి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నామని అనుమానం వచ్చిన మరుక్షణమే ఫిర్యాదు చేయాలి. అపరిచిత వ్యక్తులకు నగదు బదిలీ చేసిన తర్వాత అనుమానం కలిగితే 1930 నంబరుకు కాల్ చేయాలి. దగ్గర్లో ఉన్న సైబర్ క్రైం / పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. లేకపోతే సైబర్‌క్రైం పోర్టల్‌లో లాగిన్నై కంప్లైంట్ ఇవ్వడం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించుకోవచ్చు. ఈ పనిని తొలి గంటలోపు ఎంత త్వరగా చేస్తే అంతగా సానుకూల ఫలితాలు ఉంటాయి.

ట్రస్టు బోర్డులకు వేళాయె..



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయం

- నోటిఫికేషన్ విడుదల చేసిన దేవాదాయ శాఖ
- డిసెంబర్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- భద్రాచలం, పెద్దమ్మతల్లి, అన్నపురెడ్డిపల్లి దేవస్థానాలకు పాలకమండళ్లు

భద్రాచలం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం తొలిసారిగా పలు దేవస్థానాల్లో ట్రస్టు బోర్డులను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి, అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరాలయం, పెద్దమ్మతల్లి ఆలయాలకు పాలకమండళ్లు నియమించనుంది. దీంతో ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, తెలంగాణ వాదులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులతోపాటు పలువురు వ్యాపారులు కూడా ఆసక్తి చూపుతున్నారు. దరఖాస్తులు సమర్పిస్తున్నారు. తమ నేతలతో లాబీయింగ్ జరుపుతున్నారు.

11న జీఓ, 16న నోటిఫికేషన్..

భద్రాచలం రామాలయం, అన్నపురెడ్డిపల్లి ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయాల్లో పాలకమండలి నియామకానికి ప్రభుత్వం ఈ నెల 11న జీఓ విడుదల చేసింది. దీంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఈ నెల14న ఉత్తర్వులు జారీ చేయగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ అధికారులు ఈ నెల 16న భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 20 రోజుల్లోగా అంటే డిసెంబర్ 5వ తేదీ లోపు నేరుగా కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి తీసుకున్న క్లియరెన్స్ సర్టిఫికెట్, ప్రభుత్వ వైద్యులు ధ్రువీకరించిన ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పదో తరగతి, ఆ పైన విద్యార్హతలు కలిగిన పత్రాలను జత పర్చాల్సి ఉంటుంది. దరఖాస్తుపై పాస్‌ఫొటోను అతికించి, వివరాలను పూర్తి చేయాలి. ఆ దరఖాస్తును గెజిటెడ్ అధికారి లేదా న్యాయవాది సంతకం చేసి ధ్రువీకరించాల్సి ఉంది. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలి. వీటన్నింటిని పూర్తి చేసి దరఖాస్తుతోపాటు స్వయంగా ఖమ్మం దేవాదాయ శాఖ కార్యాలయంలో అందచేయాలి. స్వీకరించిన దరఖాస్తులను స్క్రూట్నీ అనంతరం ప్రభుత్వానికి అందచేయనున్నారు. భద్రాచలం ఆలయానికి 14 మంది సభ్యులకు, పెద్దమ్మతల్లి గుడికి 14, అన్నపురెడ్డి పల్లి ఆలయానికి ఏడుగురు సభ్యులను నియమించనున్నారు.

రామాలయానికి 14వ పాలకవర్గం..

అన్ని సవ్యంగా సాగితే భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి 14వ, తెలంగాణ రాష్ట్రంలో తొలిపాలక మండలి ఏర్పాటు కానుంది. తొలిసారిగా 1960లో భద్రాచల దేవస్థానం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్‌గా భద్రాచల దేవస్థాన అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. దీంతో తొలి ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కల్లూరి చంద్రమౌళి పేరు రికార్డుల్లో నమోదైంది. అప్పటి నుంచి 2012 నవంబర్ వరకు 13 ట్రస్టు బోర్డులు సేవలు అందించాయి. బండి శోభనాచలం, ఎస్.యతిరాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, కోనేరు నాగేశ్వరరావు, బోర్ల వెంకటేశ్వరరావు, కత్తుల శాంతయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావు చైర్మన్‌లుగా పని చేశారు. ఇందులో అల్లూరి మూర్తి రాజు రెండు పర్యాయాలు పని చేశారు. ఇక పెద్దమ్మతల్లి ఆలయానికి ఏడో ట్రస్టు బోర్డు గడువు ఈ ఏడాది మార్చిలో పూర్తయింది. నిరంతరం భక్తుల రద్దీ ఉండే ఈ ఆలయానికి 14 మందితో 8వ ట్రస్టు బోర్డు కొలువుదీరనుంది. అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తెలంగాణ ఏర్పడ్డాక తొలి బోర్డు ఏర్పాటు కానుంది. 2012లో ట్రస్ట్ బోర్డు గడువు ముగియగా ప్రస్తుతం ఏడుగురు సభ్యులతో పాలకవర్గాన్ని నియమించనున్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు అన్నారు. గురువారం పట్టణంలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రతివారం జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 23 మండలాల్లోని 30 భవిత కేంద్రాల్లో పని చేస్తున్న 36 మంది సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్‌లు, 21 రకాల వైకల్యాలు కలిగిన పిల్లలందరికీ తగిన శిక్షణను ఇస్తున్నారని తెలిపారు. దివ్యాంగ పిల్లల్లో సామర్థ్యాలను పెంచేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని అన్నారు. భవిత కేంద్రాల్లో ఇచ్చే శిక్షణతో మెరుగుపడిన దివ్యాంగ పిల్లలను సాధారణ పాఠశాలల్లో చేర్పిస్తారని అన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రైటర్ బస్తీలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు.



ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న అధికారులు

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని, నాణ్యత కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులకు, ఇంప్లీమెంటింగ్ ఏజెన్సీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, సమ్మిళిత విద్యా ఉపాధ్యాయురాలు దుర్గ, మాధవి, సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్లు శ్రీరామ్, అరుణ కుమారి, ఫిజియోథెరపిస్ట్ వసీంఅహ్మద్ , తల్లిదండ్రులు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

24న మైసూర్‌లో రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణం కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో ఈ నెల 24న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ రమాదేవి వివరాలను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఆలయ నియమ నిబంధనల ప్రకారం వివిధ రాష్ట్రాల్లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మైసూర్‌కు చెందిన శ్రీ ధాత్రి హవన సమారాధన కమిటీ ఆధ్వర్యంలో 24న జరగనుందని వెల్లడించారు. ప్రచారరథం ద్వారా స్వామివారి ఉత్సవ మూర్తులను తరలిస్తున్నట్లు తెలిపారు.

కమనీయంగా నిత్యకల్యాణం

దేవస్థానంలో గురువారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

'సర్వే' ఆన్‌లైన్‌కు కసరత్తు

- మండలానికి ఇద్దరు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ
- ఈ నెల 26 వరకు పూర్తికానున్న కుటుంబ సమగ్ర సర్వే
- జిల్లాలోని కుటుంబాలు 3,36,407, సర్వే పూర్తయినవి 2,67,160



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



శిక్షణకు హాజరైన కంప్యూటర్ ఆపరేటర్లు

చుంచుపల్లి: జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దాదాపు చివరి దశకు చేరుకుంది. జిల్లాలో 80 శాతానికిపైగా సర్వే పూర్తయింది. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం మండలానికి ఇద్దరు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లకు గురువారం కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్లు డేటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హాజరై కంప్యూటర్ ఆపరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్ నమోదుకు మండలాల వారీగా ఇన్‌చార్జిలను నియమించనున్నారు. జిల్లాలోని 23 మండల కేంద్రాల్లోని మండల పరిషత్, తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమగ్ర సర్వే వివరాలు క్రోడీకరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. తొలుత శిక్షణ పొందిన కంప్యూటర్ ఆపరేటర్లు ఆయా మండలాల పరిధిలో వివిధ శాఖల నుంచి మరికొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తీసుకొని వారికి మరోసారి శిక్షణ నిర్వహించనున్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను సైతం వినియోగించుకునే అవకాశం ఉంది.

మండలానికి 20 మంది ఆపరేటర్లు..

జిల్లాలో 3,36,407 కుటుంబాలు ఉండగా, ఇప్పటి వరకు 2,67,160 కుటుంబాల వివరాలు సేకరించారు. 75 ప్రశ్నలతో కూడిన ప్రొఫార్మాలో ఈ నెల 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. 26 వరకు పూర్తి చేయనుండగా, అదే రోజు నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టనున్నారు. అందుకు అవసరమైన కంప్యూటర్లను మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో మండలానికి 20 మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 మంది వరకు కంప్యూటర్ ఆపరేటర్లు క్రోడీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు 20 నుంచి 25 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను 236 మంది సూపర్‌వైజర్లతోపాటు పలువురు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. కుటుంబాల సంఖ్య ఆధారంగా నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సర్వే వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ప్రణాళిక తయారు చేశారు. ఇందుకోసం కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రత్యేక లాగిన్ కేటాయించి ఓటీపీ సాయంతో డేటా ఎంట్రీ చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నారు. సమగ్ర సర్వేలోని 56 అంశాలను పరిగణనలోకి తీసుకుని సర్వే చేసిన కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు.

పొరపాట్లు చేయొద్దు : కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే వివరాలు ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సమగ్ర సర్వే కంప్యూటర్ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. వివరాల నమోదులో కోడ్ నంబర్లు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియను సూపర్‌వైజర్లతోపాటు నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ములకలపల్లి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే పాలకపక్షం కాంగ్రెస్ పాలన సాగిస్తోందని, ఎన్నికల హామీల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. మండల పరిధిలోని మాధారం గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ 9వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్షాలకు సమయం కేటాయించలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వామపక్ష నాయకులతో ముఖాముఖి కలిసినా ఫలితమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు విన్నవించినా స్పందించట్లేదని ఆరోపించారు. మూడు పంటలు పండే సేద్యపు భూముల్లో ఫ్యాక్టరీ పెట్టాలనే దురాలోచన వల్లే లగచర్ల సంఘటన చోటు చేసుకుందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. తొలుత ప్రధాన కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, సభాస్థలి వరకు ప్రదర్శన చేశారు. సీతారాం ఏచూరితోపాటు పలువురు అమవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే. రమేశ్, కాసాని ఐలయ్య, యలమంచిలి రవికుమార్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పిట్టల అర్జున్, బి.చిరంజీవి, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

'సోలార్'పై విద్యార్థులకు అవగాహన

మణుగూరు టౌన్: సింగరేణి పాఠశాల విద్యార్థులకు సోలార్ విద్యుత్, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం శ్రీనివాస్ గురువారం మణుగూరులో పర్యటించారు. పాఠశాల 9వ తరగతి విద్యార్థులతో కలిసి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. సోలార్ పవర్‌తో సింగరేణి తీసుకుంటున్న పొదుపు చర్యలను, కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. సౌరశక్తి ఎంత వినియోగించుకున్నా తరగిపోని శక్తి వనరు అని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంచుకోవాలని సూచించారు. తొలుత శ్రీనివాస్‌ను ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం దుర్గం రాంచందర్, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సింగు శ్రీనివాస్, కల్యాణి, ఫిరోజ్, కృష్ణబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు, జీఎం శ్రీనివాస్

క్లుప్తంగా

జెడ్పీ సీఈఓగా నాగలక్ష్మికి పదోన్నతి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న బి.నాగలక్ష్మికి పదోన్నతి లభించింది. ఆమెకు సీఈఓ పదోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ సీఈఓగా నియమించారు. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొమరారం వాసికి డాక్టరేట్


నలమాసు కృష్ణ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం వాసి నలమాసు కృష్ణకు డాక్టరేట్ వరించింది. స్థానికంగా పదో తరగతి వరకు పూర్తి చేసిన ఆయన సుదీర్ఘకాలంపాటు విప్లవోద్యమంలో కొనసాగి పలు కేసుల పాలయ్యాడు. ఆ తర్వాత ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదివి ఎల్‌ఎల్‌బీ, ఎంఫిల్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో న్యాయవాదిగా పనిచేస్తూ పీహెచ్‌డీకి ప్రయత్నించి సఫలీకృతులయ్యాడు. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేష్ విధాత పర్యవేక్షణలో 'ల్యాండ్ రీఫామ్స్ అండ్ రిలేషన్స్ ఇన్ తెలంగాణ'అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గోదావరి తీరంలో జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న మత్స్యకారులు

దుమ్ముగూడెం : ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం సున్నంబట్టి వద్ద గోదావరి నదీతీరంలో పడవపై మత్స్యకారులు మత్స్యకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు యంబడి అర్జునరావు, నరసింహారావు, కుమారస్వామి, రాజు, దామోదర్, సాయి, ముత్యాలు, నాగరాజు, శ్రీను, సతీష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట


రహదారిపై కందకాలు తవ్విన దృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని తోగ్గూడెంలో అనుమతులు లేకుండా క్వారీలలో తవ్వకాలు నిర్వహించకుండా, క్వారీల వద్దకు వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వారు. గురువారం మైనింగ్ ఏడీ దినేష్ ఆధ్వర్యాన క్వారీల వద్ద కందకాలను తవ్వించి చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ వివేక్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నిర్వహించకూడదన్నారు.

రూ.20వేల మందులు సీజ్


తనిఖీ చేస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సంపత్‌కుమార్

టేకులపల్లి: మండల పరిధిలో బోడు గ్రామంలో గురువారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సీహెచ్.సంపత్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడి వద్ద లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.20 వేల విలువైన 29 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు, లైసెన్సులు లేకుండా అల్లోపతి మందులను నిల్వ ఉంచి, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ క్రైం పోలీసుల అదుపులో యువకులు

వైరారూరల్: వైరా మండలం గొల్లపూడికి చెందిన ఇద్దరు యువకులను గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన సైబర్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ యువకులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తుండగా వర్క్ ఫ్రం హోం విధానంలో ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, వీరిద్దరు ఓ యాప్‌ను రూపొందించి, ఒకే ఐడీతో వేర్వేరు వ్యక్తులకు విక్రయించి మోసం చేశారని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. మహారాష్ట్రలోని పలు కంపెనీలకు యాప్‌ను విక్రయించినట్లు ఆరోపణతో మూడు నెలల క్రితం మహారాష్ట్ర పోలీసులు గొల్లపూడికి చెందిన ఓ యువకుడిని విచారించారు. ఇదే సమయాన ఇంకో యువకుడి బ్యాంకు ఖాతాలో రూ.లక్షల్లో నగదు జమ కావడంతో ఐటీ శాఖ సమాచారం మేరకు సైబర్ క్రైం పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా, హైదరాబాద్ తరలించి విచారించాక వదిలేసినట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

కరువు 'కోత'లు..!


వరి కోస్తున్న హార్వెస్టర్

మారుతున్న కాలానుగుణంగా వరి కోతల తీరులోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. రైతులు యంత్రాలను వినియోగిస్తుండడంతో పశువులకు మేత కరువైంది. గతంలో కూలీల ద్వారా వరి పొలాలను కోసి, కుప్పులు వేసి కొట్టిన తర్వాత ఎండు గడ్డిని పశువులదాణా కోసం ఏడాదిపాటు నిల్వ చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హార్వెస్టర్, పాడిరిపర్లు వచ్చిన తర్వాత తక్కువ సమయంలో ధాన్యం ఇంటికి చేరుతున్నప్పటికీ పశువులకు గడ్డిమాత్రం దొరకడం లేదు. దీంతో మూగ జీవాలకు పశుగ్రాసం కొరత రైతులను వేధిస్తోంది. – పాల్వంచరూరల్


గడ్డి కొనుగోలు చేసి తీసుకొస్తున్న రైతు

ఆధునిక యంత్రాల వినియోగంపై రైతుల ఆసక్తి
- ఖర్చులు సగానికి పైగా ఆదా
- పశువులకు కరువవుతున్న పశుగ్రాసం
- కూలీలకు తగ్గిన ఉపాధి

పంటంతా ఒకేసారి చేతికొస్తుందని..

ప్రతీ సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో వరి సాగు విస్తీర్ణం పెరుగుతున్నా.. వరి కోత యాంత్రాల వినియోగంతో పశుగ్రాసం దొరకడం కష్టంగా మారింది. హార్వెస్టర్ ద్వారా కోయించడంతో వరి మొక్కలు ముక్కలు, ముక్కలు కావడంతో గడ్డిని కట్టలు కట్టలేక అర్ధాంతరంగా వదిలేస్తున్నారు. అదే కూలీల ద్వారా వరి పంటను కోయిస్తే గడ్డిని కట్టలుగా కట్టి నిల్వచేసుకునే అవకాశం ఉంది. యంత్రాలతో వరికోతలు కోయడం ద్వారా నష్టం, సమయం తగ్గి పూర్తిస్థాయిలో పంట దిగుబడి చేతికి వస్తుందని రైతులు అంటున్నారు.

కూలీలకు 'ఉపాధి' కరువు

కూలీల ద్వారా వరి పంటలను కోయిస్తే రెండు నెలల పాటు గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు తీరికలేకుండా పనులు దొరికేవి. ఒక పొలాన్ని రెండు, మూడు రోజులు కోశాక మరో రెండు మూడు రోజుల తర్వాత వాటిని మోపులుగా కట్టి ఒక చోట కుప్పలుగా పేర్చుతారు. వారం, పది రోజుల తర్వాత ఆ కుప్పను కూలీల ద్వారా నూర్పించేవారు. దీంతో సమయం ఎక్కువ పట్టినప్పటికీ ధాన్యంతో పాటు వరిగడ్డి కూడా లభించేంది. అయితే యంత్రాల ద్వారా కోయిస్తే గడ్డంతా పంట పొలాల్లోనే వృథాగా పోతుంది. అయినా రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపిస్తున్నారు. దీంతో వరిగడ్డి కొరత పెరిగి కూలీలకు పని కరువైంది.

రెండు రకాల యంత్రాలతో..

వరిపంటను రెండు రకాల యంత్రాలతో కోయించడం వలన పశుగ్రాసం దొరకడం లేదు. టైర్లతో ఉన్న హార్వెస్టర్ ద్వారా వరిని కోయిస్తే కొంతగడ్డి ముక్కలు, ముక్కలుగా అయినా రైతుకు గడ్డి వస్తుంది. అదే చైన్‌తో నడిచే హార్వెస్టర్‌తో కోయిస్తే గడ్డి మొత్తం పొలంలోనే పనికి రాకుండా పోతుంది. దీంతో రైతులకు వరిగడ్డి కొరతను ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. వానాకాలంలో వరి గడ్డి కట్టకు ధర స్వల్పంగా ఉంటుంది. కాని ఎక్కువ మంది రైతులు వరిగడ్డి కొనుగోలు చేయడంతో గడ్డి ధరలను పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గడ్డి కరువైంది..



వానాకాలంలో వరి సాగు చేస్తే దాని గడ్డి పశువులకు ఏడాదిపాటు పుష్కలంగా ఉండేది. ఎప్పుడైతే యంత్రాల ద్వారా వరి పంటలను కోయించడం మొదలైందో అప్పటి నుంచి పశువులకు గ్రాసం కొరత ఏర్పడింది. పశుగ్రాసం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసుకుని రావాల్సిన పరిస్థితి నెలకొంది.
– కొత్త రామారావు, రైతు

ఇతర ప్రాంతాల్లో కొంటున్నాం..



ఆయకట్టు సాగులో వరి పంట పండిస్తున్న యంత్రాల కోతలతో వరిగడ్డి కట్టకు రూ.110 చొప్పున ధర పెరిగింది. దీంతో ఒక్క ట్రాక్టర్ లోడు ధర రూ.12వేల నుంచి రూ.14వేల చొప్పున ఇతర ప్రాంతాల నుంచి కొనాల్సి వస్తోంది. గతంలో కూలీలతో కోయించినప్పుడు గడ్డి పుష్కలంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో గడ్డికి డిమాండ్ పెరిగింది.
– కళ్లెం వెంకట్‌రెడ్డి, రైతు


కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

విశ్వసనీయతే కీలకం

పోలీసులు ప్రజాసేవకు అంకితం కావాలి
- మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- ఖమ్మం సీటీసీలో ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్
- శిక్షణ పూర్తిచేసుకున్న 263మంది కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: సమాజంలో పోలీసు వ్యవస్థపై విశ్వసనీయత మరింత పెరిగేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రజాసేవకు అంకితం కావడం ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఖమ్మం సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో రాచకొండ కమిషనరేట్‌కు చెందిన 92మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, రామగుండం, వికారాబాద్‌కు చెందిన 171 మంది సివిల్ కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల శిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో ట్రెయినీ కానిస్టేబుళ్ల కుటుంబీకులు, సన్నిహితుల నడుమ పాసింగ్ ఔట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కనుల పండుగగా జరిగింది. ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఐజీ.. 'విధినిర్వహణలో వివక్ష చూపబోం.. మా సేవలతో దేశ ప్రతిష్ట పెంచుతాం' అని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజల రక్షణే మన బాధ్యత

ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం పోలీస్ శాఖ ఉద్యోగులకు ఉంటుందని తెలిపారు. ఈవిషయాన్ని గుర్తించి అప్పగించిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజల రక్షణ ధ్యేయంగా, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. నిత్యం పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నందున ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అవినీతి ఆరోపణలు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. నేరస్తులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటున్నందున ఈ బ్యాచ్ కానిస్టేబుళ్లకు శిక్షణలో కొత్త చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించామని ఐజీ తెలిపారు. కాగా, శిక్షణ కానిస్టేబుళ్లు సెప్టెంబర్ మొదటి వారంలో మున్నేటి వరదల సమయాన బాధితులకు విస్తృతమైన సేవలందించారని గుర్తు చేశారు.

ఇక్కడితో ఆగొద్దు....

దీక్షాంత్ పరేడ్‌కు హాజరైన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు వివరాలు వెల్లడించిన ఐజీ ఆయన కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. రోహిత్‌రాజు తండ్రి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి ఏఎస్సైగా రిటైర్ అయ్యారని తెలిపారు. ఆయన తన కుమారుడిని మాత్రం బాగా చదివించి ఐపీఎస్‌గా చేశారని చెప్పారు. అలాగే, కానిస్టేబుళ్లు ఇక్కడితో ఆగకుండా ఉన్నత విద్య చదువుతూ మంచి స్థాయికి ఎదగాలని, పిల్లలను కూడా తీర్చిదిద్దాలని ఐజీ సూచించారు.

టాపర్లు వీరే...

ఖమ్మం సీటీసీలో ఈ ఏడాది ఫిబ్రవరి 21న ట్రెయినీ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభమైంది. సీటీసీలో ఇది ఎనిమిదో బ్యాచ్ కాగా, వీరిలోటాపర్లను ప్రకటించారు. రాచకొండకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు పి.రఘు, కె.కిషోర్, రామగుండంకు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు జి.ప్రశాంత్, ఎం.నవీన్‌కుమార్, డి.ప్రదీప్ టాపర్లుగా నిలవగా.. బెస్ట్ ఆల్ రౌండర్ హరీష్ ఐజీ చేతుల మీదుగా జ్ఞాపికలు అందకున్నారు. ఇంకా ఈ సమావేశంలో ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్, అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రఘు, రెహమాన్, రవి, శ్రీనివాసులు, సాంబరాజు, నర్సయ్య, సుశీల్‌సింగ్, ఎస్‌బీ సీఐ రాజిరెడ్డి, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్, డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.


రాచకొండ యూనిట్‌లో టాపర్‌గా అవార్డు అందుకుంటున్న రఘు

పకడ్బందీగా అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు సూచించారు. పరీక్ష క్షేత్ర పరిశీలకులుగా ఎంపికైన పాఠశాల ఛాత్రోపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం సుజాతనగర్ మండలంలోని మదీన బీఈడీ కళాశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వే కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులకు పరీక్ష నిర్వహించే విధానం, పిల్లలను ఎన్నిక చేసే విధానం, పరీక్షకు ముందు, తర్వాత చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పాల్వంచ నవభారత్ పాఠశాలలోని రీజినల్ కస్టడీ సెంటర్‌కు తరలించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్, ప్రిన్సిపాల్ మహమూద్ పాష, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఖమ్మంరూరల్: ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు తోడు సాంకేతిక పరిజ్ఞానాన్ని జైళ్ల శాఖ ఉద్యోగులు అందిపుచ్చుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ ఉద్యోగులకు దానవాయిగూడెంలో నిర్వహిస్తున్న రీట్రీట్‌ను రెండో రోజైన గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన తీసుకొచ్చేలా ఉద్యోగులు కృషి చేయాలని, న్యాయవ్యవస్థ ద్వారా అందేలా ఉచిత సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులు టి.కళాసాగర్, జి.విజయ్‌డేని, జి.వెంకటేశ్వర్లు, ఏ.సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రీట్రీట్‌లో జ్యోతి వెలిగిస్తున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

సేవలు వినియోగించుకోండి

కొణిజర్ల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, చంద్ర శేఖర్‌రావు సూచించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో పారా లీగల్ వాలంటీర్ కోయిన్ని శంకరరావు ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడొద్దని హితవు పలికారు. ఆతర్వాత కుటుంబ సమస్యలు, బాల్య వివాహాలు, రుణాలు తదితర అంశాలపై న్యాయ సలహాలు అందించారు. మాజీ సర్పంచ్ పొట్లపల్లి శ్రీనివాసరావుతో పాటు బూరప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం నిఘా నేత్రం..!

పామాయిల్ తోటను ఇంటివద్ద నుంచే పర్యవేక్షించాలని భావించిన ఓ రైతు వినూత్న ఆలోచనతో తన పామాయిల్ క్షేత్రంలో నిఘా నేత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అశ్వారావుపేట మండలం మద్దికొండ గ్రామం నుంచి నారంవారిగూడెం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న పామాయిల్ తోట ప్రవేశం వద్ద సోలార్‌తో పని చేసే 360 డిగ్రీ సీసీ కెమెరాను అమర్చాడు. దీంతో తోటలోకి వచ్చి వెళ్లే వారి కదలికలు, చోరీ ఘటనలు గుర్తించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. దీన్ని అటువైపుగా వెళ్లే వారు ఆసక్తిగా చూస్తుండడంతో గురువారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.
– అశ్వారావుపేటరూరల్


పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఎరువుల లోడ్ వ్యాన్ బోల్తా

కామేపల్లి: ఎరువుల లోడ్‌తో వెళ్తున్న మినీ డీసీఎం అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి కారేపల్లికి గురువారం ఎరువుల బస్తాలు తీసుకెళ్తున్న వ్యాన్ మండలంలోని పండితాపురం బైపాస్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడిగా ఎరువుల బస్తాలు కింద పడడంతో మరో వాహనంలో తరలించారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: జామాయిల్ తోట వివాదంలో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి దంతలబోరు గ్రామపంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామంలో ఏపీలోని ఎటపాక మండలం తోటపల్లికి చెందిన నల్లజాల శ్రీదేవికి వారసత్వం ద్వారా వచ్చిన భూమిలోని జామాయిల్ తోటను నరికేయిస్తుంది. దీంతో శ్రీదేవి బాబాయి అయిన ఏలూరి భీమయ్య, భానుప్రసాద్, ప్రతాప్‌లు అడ్డుపడి గొడవ పెట్టుకుని చంపుతామని బెదిరించారని, గతంలో కూడా ఇలానే వ్యవహరించారని పోలీసులకు శ్రీదేవి గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.

చెట్టుకొమ్మ ఇంట్లో పడిందని దాడి..

పాల్వంచరూరల్: చెట్టుకొమ్మను నరకడంతో తన ఇంట్లో పడిందని కొమ్మను నరికిన వ్యక్తిపై దాడిచేసిన సంఘటన ఇది. పోలీసులు కథనం ప్రకారం.. మండల పరిధి బస్వతారాక కాలనీ పంచాయతీలోని సీతానాగారం గ్రామానికి చెందిన చింతరాల తిరుపతిరావు గురువారం తన ఇంటి వద్ద గల చీమచింత (గుబ్బ) చెట్టుకొమ్మను నరికాడు. ఈక్రమంలో అది పక్క ఇంట్లో పడడంతో భూక్యాకుమార్ గొడవ పడి దాడి చేశాడని తిరుపతిరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.

బస్టాండ్‌లో తప్పిన పెను ప్రమాదం

పాల్వంచ: పాల్వంచ బస్టాండ్‌లో రెండు బస్సులు వెనుక భాగంగా ఢీకొన్నాయి. గురువారం మణుగూరు బస్సు రివర్స్ తీసుకుంటుండగా మంథని బస్ డిపో బస్సు ఢీకొంది. దీంతో ఒకదానికొకటి రాసుకోగా ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ ఘనటలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.


రెండు బస్సులు ఢీకొన్న దృశ్యం

డ్రైవర్, కండక్టర్‌ను దూషించడంపై ఫిర్యాదు

నేలకొండపల్లి: చెప్పిన చోటల్లా బస్సు ఆపాల్సిందేనంటూ డ్రైవర్, కండక్టర్‌ను దూషించిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఖమ్మం డిపోకు చెందిన బస్సు గురువారం ఖమ్మం నుంచి చెన్నారం వెళ్లి ఆపై బోదులబండకు చేరుకుంది. గ్రామంలో పలుచోట్ల బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి బస్సుకు అడ్డం పెట్టారు. తాము చెప్పిన చోటల్లా బస్సు ఆపాల్సిందేనని గొడవ పడుతూ డ్రైవర్, కండక్టర్‌ను దూషించారు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించడమే కాక దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ బి.ఉప్పయ్య, కండక్టర్ సీ.హెచ్.శిరోమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో మేక వెంకన్న(56) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భవన నిర్మాణ పనుల్లో ఉన్న ఆయన చేతిలోని ఇనుప చువ్వ పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకింది. దీంతో షాక్‌కు గురైన వెంకన్నను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళ..

ముదిగొండ: నీరు తాగేందుకు దిగుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళా కూలీ మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలం గుమ్మళ్లకు చెందిన అంజమ్మ (27) గురువారం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం సమీపాన కూలీ పనులకు వచ్చింది. ఆమెకు దాహం వేయడంతో సమీపంలోని బావిలోకి దిగుతుండగా కాలు జారి పడడంతో మృతి చెందింది. స్థానికుల ఇచ్చిన సమాచారంతో ముదిగొండ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కేసు నమోదు చేశారు.